

## భూసేకరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి**



**అంబర్‌పేట్:** గోల్నాక నుంచి అంబర్‌పేట్ వరకు సుమారు రూ.335కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫ్లైఓవర్‌కు అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ సీనియర్ ఇంజినీర్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ జోనల్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి భూసేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఫ్లైఓవర్‌కు సంబంధించిన సివిల్ పనులు పూర్తయ్యాయని, సర్వీస్ రోడ్డు వేసేందుకు వివిధ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత పనులను కొనసాగించనున్నట్లు సీనియర్ ఇంజినీర్ ధర్మారెడ్డి కమిషనర్కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ గోల్నాక నుంచి అంబర్‌పేట్ వరకు తిరిగి భూసేకరణ పనులను పరిశీలించారు. కొన్నిచోట్ల నిర్మాణానికి కోర్టు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఆ పనులను కొనసాగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

### ముషీరాబాద్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

**ముషీరాబాద్:** జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటి వరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచికుమార్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన సేవాకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

**ముషీరాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నిమ్‌కర్ పేర్కొన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో ట్రాక్స్ సొసైటీ రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రేడియెంట్ హై స్కూల్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు 'రైడ్ టూ సేఫ్టీ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా గంటకు 50మంది ద్విచక్ర వాహనాదారులు రోడ్డు ప్రమాదాలలో మృతి చెందుతున్నారని తెలిపారు. రెండేళ్ల నుంచి రోడ్డు ప్రమాదాల సంఖ్య కొంత తగ్గిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్ పాల్గొన్నారు.

### 'పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థికే మా మద్దతు'

**ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్**

**కాచిగూడ:** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతోందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వందల కోట్లు డబ్బులు వెదజల్లి గెలిచిన తర్వాత కనీసం మీ ఫోన్‌కాల్ కూడా ఎత్తని అభ్యర్థులు కావాలో లేక మీ మధ్యనే ఉండి మీకోసం పని చేసే విద్యావంతుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. ఏ పదవి లేకపోయినా తన సొంత నిధులతో నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మహ్మద్ ముస్తాక్ అలీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ, నేతలు విజయ్ ముల్లంగి, నర్సింగ్, యమునగౌడ్, జావీద్, షరీఫ్, డాక్టర్ లక్ష్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో మహిళ మృతి

**కాచిగూడ:** అనారోగ్యంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హెచ్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక సంజీవయ్యనగర్‌కు చెందిన వెంకటేష్ భార్య మంజుల (45) కొంత కాలంగా మూర్ఛ (ఫిట్స్)తో బాధపడుతోంది. మంగళవారం ఆమెకు ఫిట్స్ రావడంతో చనిపోయి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాల్సిందే..

- అంబర్‌పేట సర్కిల్ పరిధిలో వ్యాపార భవనాలు 11031
- ట్రేడ్ లైసెన్స్‌లు పొందినవి 3321 మాత్రమే..
- మిగితా వారు సైతం తీసుకునేలా చర్యలు
- స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు



జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీస్

**ట్రేడ్ లైసెన్స్ పొందండి ఇలా...**

వ్యాపార నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రెంటల్ అగ్రిమెంట్, వ్యాపార సముదాయానికి సంబంధించిన బ్లూ ప్రింట్, ప్రాపర్టీ ట్యాక్స్, ఆధార్ వంటి ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అనంతరం విచారణ జరిపి ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తారు. ప్రధాన రోడ్లలో దుకాణాలు ఉంటే ఏడాదికి చెల్లించాల్సిన ఫీజు ఎస్ఎఫ్‌టీకి రూ.6, మిగతా రోడ్లలో ఎస్ఎఫ్‌టీకి రూ.4 చొప్పున ఉంటుంది.

**అంబర్‌పేట:** జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండిపడుతోంది. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఉన్న వ్యాపార సముదాయాలకు, తీసుకున్న ట్రేడ్ లైసెన్స్‌లకు ఎక్కడా పొంతన లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా వ్యాపార భవనాల కోసం టౌన్ ప్లానింగ్ విభాగంలో అనుమతి పొందిన వాటి వివరాలను తీశారు. సర్కిల్ పరిధిలో 11,031 వ్యాపార భవనాలు ఉన్నాయి. ఈ భవనాల్లో వ్యాపారస్తులు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అందులో కేవలం 3,321 ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రమే తీసుకున్నారు. సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల సంఖ్య పెంచేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారలులను గుర్తించి ట్రేడ్ లైసెన్స్ పొందేలా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతోంది.

**ట్రేడ్ లైసెన్స్ లేకుంటే భారీ జరిమానా...**

◆ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే భారీ జరిమానాలు విధించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా ట్రేడ్ లైసెన్స్ విధిగా ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. వ్యాపార సముదాయ స్థలాన్ని పరిగణలోకి తీసుకుని ట్రేడ్‌లైసెన్స్ పొందేందుకు ఓ ఫీజు ఉంటుంది. ఇప్పటికే ట్రేడ్‌లైసెన్స్ తీసుకోని వారిపై ముందస్తుగా సమాచారం ఇస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు లైసెన్స్ తీసుకోవాలని చెప్పినా పట్టించుకోని వ్యాపారులపై జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

**విధిగా ట్రేడ్ లైసెన్స్ పొందండి**



సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న వ్యాపారస్తులు విధిగా ట్రేడ్ లైసెన్స్ పొందాల్సిందే. ట్రేడ్ లైసెన్స్ కోసం తమను సంప్రదిస్తే పారదర్శకంగా, సులభతరంగా జారీ చేస్తాం. ట్రేడ్ లైసెన్స్ లేని వారికి భారీ జరిమానాలను విధించేందుకు వెనుకాడం.

– డాక్టర్ హేమాలత, సర్కిల్–16 ఏఎంహెచ్‌వో

## కుల గణనను సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్**



నెహ్రూనగర్‌లో కులగణన సర్వేలో ప్రచారం చేస్తున్న బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, వీహెచ్

**కాచిగూడ:** కులగణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని.. ఈ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని వారి కుటుంబ సభ్యుల పేర్లు రీ–సర్వేలో నమోదు చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ సూచించారు. మంగళవారం గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లో కాంగ్రెస్ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి కులగణన సర్వే పట్ల ప్రజలకు కరపత్రాలను పంచుతూ ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, తొలుపునూరి కృష్ణాగౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్యూమరేటర్లకు, వార్డు అధికారులకు సర్వేకు సంబంధించి దిశ నిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. మూడు విధాలుగా వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ (040–21111111)కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను పిలిపించుకునే అవకాశం ఉందన్నారు. ఈసారి ఆన్‌లైన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇవ్వొచ్చని అన్నారు.

◆ ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కులగణన చేపడుతున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన అమలు చేయాలని, అనవసరంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితర నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అఫ్సర్ నవాబ్ జాహి, పోలినేని రామ్మోహన్‌రావు, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్‌కుమార్, జమీర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలి



బర్కత్‌పురలో చేపట్టిన దండోరా ధర్మదీక్షలో మాట్లాడుతున్న పోకల కిరణ్‌మాదిగ

**కాచిగూడ:** ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను అమలు చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బర్కత్‌పురలోని సామాజిక భవన్‌లో మంగళవారం ఒకరోజు దండోరా ధర్మ దీక్షను ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్‌లో క్రీమీలేయర్ అమలు చేయాలని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు చెప్పిందన్నారు. ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్రీమీలేయర్‌రద్దుకై తెలంగాణ మంత్రివర్గ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రస్తుత జనాభా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ కోటా పెంచాలని డిమాండ్ చేశారు. పోకల కిరణ్ మాదిగ చేపట్టిన దండోరా ధర్మ దీక్షలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో భారతీయ ప్రజా సంఘాల జేఏసీ చైర్మ గొల్లపల్లి దయానంద్ రావు, మాదిగ మేధావుల సంఘం అధ్యక్షుడు అరెపల్లి రాజేందర్, సమగర మోచీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణి ప్రేమ్‌రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మాదిగ సంఘాల కూటమి అధ్యక్షుడు కొండ్రా రాజు, కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జగదీష్, ప్రజా గాయకులు మాస్టర్ జీ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కె.బి.శ్రీధర్, బీసీ యువజన సంఘాల జేఏసీ నేత, కొమ్మగాని రమేష్, జైభీమ్ మహిళా సంఘం అధ్యక్షురాలు అంజని, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇంక్విలాబ్, ఆర్ఎస్ఎస్ బీజేపీలు కోరుకునేది పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** దేశంలో కొనసాగుతున్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. దేశంలో హిందుత్వ ఎజెండాను అమలు చేయడానికి ప్రత్నిస్తున్నారని అది ఎంత ప్రమాదకరమో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో ఎస్.వినయ్ కుమార్ అనువాదం చేసిన 'ఇంక్విలాబ్', జి రఘుపాల్ అనువాదం చేసిన 'ఆర్ఎస్ఎస్, బీజేపీలు కోరుకునేది'పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ... వర్గ దోపిడీకి గురవుతున్న ప్రజల్ని ఐక్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిస్థితుల్లో సామాజిక మార్పు, భవిష్యత్ ఉద్యమాల మార్పునకు ఈ పుస్తకాలు దోహదపడతాయని తెలిపారు. హిందూ రాజ్యస్థాపనే లక్ష్యంగా దేశంలో బీజేపీ పార్టీ కొనసాగుతోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమిళనాడులో బుల్లెట్ నడిపిన దళిత యువకుడి చేతులు కూడా నరికారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల అసమానాతలు నిర్మూలించాలనే లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె. ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆర్.వాసు, మేనేజర్ డి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలి



జానపద కళాకారులకు జీవన భృతి కల్పించాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీధర్ దేశ్‌పాండే

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా జానపద కళలు ప్రదర్శించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని జానపద వృత్తి పరిరక్షణ జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జానపద కళాకారులకు ఉపాధి కల్పించాలని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ్‌పాండే మాట్లాడుతూ... 15 సంవత్సరాల క్రితం డీపీఆర్‌వో కింద కళాకారులకు జీవన భృతి కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వారికి జీవన భృతి కరువైందని వాపోయారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, ఫించన్‌లు, ఇళ్లు ఇప్పించాలని ఆయన కోరారు. తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... తెలంగాణలో యక్షగాన జానపద కళాకారులపై సమగ్ర సర్వే నిర్వహించి వారికి జీవన భృతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు చైర్మన్ వి.రామకృష్ణారెడ్డి, సీహెచ్ సుధాకర్, భవాని, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. శంకర్‌మఠల్‌ఫీడర్ పరిధిలోని నల్లకుంట, పద్మాకాలనీ, మాతృశ్రీ స్కూల్, ఫీవర్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో ఉదయం 10.30గంటల నుంచి 11.30గంటల వరకు, నారాయణగూడ ఫీడర్ పరిధిలోని బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సూర్యనగర్, నెహ్రూనగర్, అరోరా డిగ్రీ కాలేజ్ తదితర ప్రాంతాలలో 12గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### మార్చి 10 నుంచి సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** తెలంగాణలో సైకాలజిస్టులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంచందర్ మాట్లాడుతూ... మార్చి 10 నుంచి 13 వరకు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ అనే అంశంపై రెండు తెలుగు రాష్ట్రాలలోని సైకాలజిస్టులకు ఉదయం 10గంటల నుంచి 5గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కాలంలో కమ్యూనికేషన్ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, జట్టు నిర్మాణం, ప్రేరణ, సృజనాత్మకత, ప్రశ్నించే పద్ధతులు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి వెంపటి రాజు, డాక్టర్ శ్రీపూజ, సుధాకర్, కృష్ణసాహితీ, కొండేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులంటే ప్రభుత్వాలకు గిట్టదు

**పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్**



పౌరహక్కుల నేత ఆజామ్ అలీ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా పరిపాలన చేయలేని స్థితికి చేరుకున్నాయని అందుకే పౌర హక్కుల ఉద్యమకారుల్ని హత్యకు గురిచేస్తున్నాయని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో పౌర హక్కుల నేత ఆజామ్ అలీ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొ. గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రశ్నించే గొంతులంటే ప్రభుత్వాలకు గిట్టదన్నారు. పౌర హక్కుల సంఘం ప్రశ్నలంటే సహించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. హక్కుల ఉద్యమాన్ని నిశబ్దం చేయాలనే ఉద్దేశంతో , హత్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు.

◆ ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... అమరుడు ఆజామ్ అలీ అన్నట్లుగా హక్కుల కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా త్యాగం చేస్తానని అన్నారని గుర్తు చేశారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండటం కోసమే ఉద్యమకారులను హత్య చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోసం వీరులుగా మరణిస్తారని వీరోచిత త్యాగాలతో ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అలాంటి వ్యక్తులలో ఆజామ్ అలీ ఒకరని అన్నారు. పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పీఎం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, హైకోర్టు అడ్వకేట్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కథలు నిజజీవిత 'ప్రతిబింబాలు'



ప్రతిబింబాలు కథా సంపుటి ఆవిష్కరిస్తున్న బైస దేవదాసు, వంశీ రామరాజు

**చిక్కడపల్లి:** కథలు నిజజీవిత ప్రతిబింబాలని 'నేటి జీవితం'సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో మంగళవారం వంశీ ఆర్ట్స్ థియేటర్స్ లేఖిని రచయిత్రులు వేదిక ఆధ్వర్యంలో కస్తూరి అలివేణి రచించిన 'ప్రతిబింబాలు'కథా సంపుటి ఆవిష్కరణ, వంశీ రామరాజు, డాక్టర్ తేన్నేటి సుధాదేవికి అంకిత మహోత్సవం సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బైస దేవదాసు సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. వాస్తవికగా ఉన్న కథలు కాల పరీక్షకు నిలబడతాయని అన్నారు. అలివేణి చెప్పిన కథలు సమాజంలో జరిగే సంఘటనలను అద్దంపడతాయని అన్నారు. అంకితం తీసుకున్న వంశీ దంపతులు సాంస్కృతిక సాహిత్యరంగాలకు రెండు కళ్లని అని అభివర్ణించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. సులభమైన పదాలతో అతిశయోక్తులు లేకుండా చెప్పే నేర్పు అలివేణి సొంతమని అన్నారు. ఇంటిపేరు కస్తూరిలోనే సుగంధం నింపుకున్న ఆమె కథలు సువాసన భరితమని పేర్కొన్నారు.

## లో–ప్రెషర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు



బీఎస్‌రెడ్డి వీధిలో వాటర్‌వార్క్స్ అధికారులకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పావని

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లో తాగునీరు లో–ప్రెషర్‌తో రావడంతో ప్రజలు ఇబ్బందులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కార్పొరేటర్ ఎ.వినయ్‌కుమార్ సూచించారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్రకేఫ్ చౌరస్తా సమీపంలోని బీఎస్‌రెడ్డి వీధిలో స్థానికుల ఫిర్యాదు మేరకు వాటర్‌వార్క్స్ అధికారులతో కలసి ఆమె ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమస్యను అధిగమించడానికి నూతన పైపులైన్ వేయాలని వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డికి సూచించారు. డివిజన్‌లోని వివేక్‌నగర్, చిక్కడపల్లి, వివేక్‌నగర్ బస్తీ, బాపునగర్ తదితర ప్రాంతాలలో సైతం ఈ సమస్య ఉందన్నారు. సీవరేజీ సమస్యపై ఇది వరకే బీఎస్‌రెడ్డి బస్తీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు నూతన సీవరేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు నివేదిక సమర్పించామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్ వార్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, వర్క్స్ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ నేతలు ఆనంద్‌రావు, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్ స్థానికులు పాల్గొన్నారు.

## తులం బంగారంపై ప్రశ్నించండి

**అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**
**ప్రభుత్వ వ్యవహార తీరుపై తీవ్ర అసహనం**





లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్లు

**అంబర్‌పేట:** కల్యాణలక్ష్మి పథకంతో లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ లబ్ధిదారులకు సూచించారు. ఇప్పటికీ మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన కల్యాణలక్ష్మి పథకంతో లబ్ధిదారులకు చెక్కులు వస్తున్నాయన్న విషయం గమనించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, వారిని ఇచ్చిన హామిలపై నీలదీయాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు రావాని ప్రజలు వస్తాయన్న భ్రమల నుంచి బయటకు రావాలని కోరారు. పేదలకు సొంత ఇంటిపై ఎన్నో కలలు ఉంటాయని వాటితో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటుదని ఆయన మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి జిరాక్స్ పైసలు కూడా దండగా అని ఆయన కుండబద్దలుకొట్టారు. మంగళవారం అంబర్‌పేటలో 190 మందికి సుమారు రూ.2 కోట్లు మంజూరైన షాదీముబారాక్, కల్యాణలక్ష్మి చెక్కులను కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్, అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయిలతో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హాయంలో ప్రజలు అన్ని రకాల సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమయానికి పొందారన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తుల వరకే పరిమితం అవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడాను ప్రజలు ఇప్పటికే గ్రహించి కాంగ్రెస్ పట్ల విరక్తి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బందితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మళ్లీ కేసీఆర్‌ను ఆదరించే రోజులు వస్తున్నాయి

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** దేశంలో ఎక్కడ లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అందులో భాగంగానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను అమలు చేశారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం హిమాయత్ నగర్ మండల కార్యాలయంలో 21కల్యాణలక్ష్మి, 5 షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ... పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. మళ్లీ కేసీఆర్‌ను ఆదరించే రోజులు వస్తున్నాయని అన్నారు. ప్రజల కష్టాలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సంధ్యారాణి, కార్పొరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, కళ్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.